

చేర్యాల పోలీస్‌స్టేషన్ వద్ద విద్యార్థులు

## అర్ధరాత్రి వేళ పోలీస్‌స్టేషన్‌కు విద్యార్థుల పరుగులు

- చేర్యాల గురుకుల విద్యాలయంలో ఘర్షణ
- టెన్త్ విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల దాడి
- నైట్ స్టే అధికారి, వాచ్‌మెన్‌ల నిర్లక్ష్యంపై ఆగ్రహం

చేర్యాల, జూలై 5 : చేర్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన పలువురు పదో తరగతి విద్యార్థులు గురువారం అర్ధరాత్రి ప్రాణభయంతో పోలీస్‌స్టేషన్‌కు పరుగులు పెట్టారు. సీనియర్ విద్యార్థులు దాడులు చేయడంతో గోడ దూకి ఠాణాను ఆశ్రయించారు. బాధితుల కథనం ప్రకారం.. చేర్యాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు ఉంటారు. రోజువారీలాగే పాఠశాలలో విద్యార్థులంతా కలిసి గురువారం రాత్రి భోజనం చేసిన తదుపరి వసతి గదులలోకి వెళ్లారు. పదో తరగతి విద్యార్థులు తమ గదిలో చదువుకుంటున్న క్రమంలో అదే భవనంలోని కొందరు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు వచ్చి అల్లరి చేస్తున్నారంటూ పదో తరగతి విద్యార్థులపై బెల్టులు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. అందినవారిని అందినట్లు ఇష్టానుసారంగా కొట్టడంతో పదో తరగతి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. భయపడిపోయి హాస్టల్ గోడ దూకి పరుగులు తీస్తూ చీకట్లోనే రెండు కిలోమీటర్ల దూరంలోని పోలీస్‌స్టేషన్‌కు పరుగులు పెట్టారు. అక్కడి పోలీసులకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమను పశువులకన్నా హీనంగా కొట్టారని, గొంతునులిమారని కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్‌ఐ దామోదర్ విద్యార్థులకు నచ్చచెప్పి సిబ్బందితో పాఠశాలకు చేర్చారు. ఉదయం వేళ చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ దామోదర్ పాఠశాలకు వచ్చి.. దాడికి పాల్పడిన ఇంటర్ విద్యార్థులను మందలించారు. సత్ప్రవర్తనతో మెదలకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగతా విద్యార్థులందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. గురుకులాల ఆర్‌సీవో నిర్మల పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన ఎనిమిది మంది విద్యార్థులను ఒక్కో పాఠశాలకు పంపించనున్నామని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి కృష్ణమూర్తి, వాచ్‌మన్ లక్ష్మణ్‌కు మెమో జారీ చేశామని, ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు.



ఇంటర్ విద్యార్థుల దాడిలో విద్యార్థి వీపుపై అయిన గాయాలు



రికవరీ చేసిన సెల్ ఫోన్లను అందుకున్న బాధితులతో సీపీ డాక్టర్ బి.అనురాధ

## 66 సెల్‌ఫోన్ల రికవరీ

**బాధితులకు అందజేసిన కమిషనర్ ఆఫ్ పోలీస్ అనురాధ**

సిద్దిపేట క్రైం, జూలై 5 : పడిపోయిన, చోరీకి గురైన 66 సెల్‌ఫోన్లను శుక్రవారం పోలీస్ కమిషనర్ బి.అనురాధ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయిన, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్ డాటాలో నమోదు చేస్తే ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. గతేడాది ఏప్రిల్ 20వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలో సీఈఐఆర్ పోర్టల్‌లో 2,560 మంది సెల్‌ఫోన్‌లు పోయినట్లు నమోదు చేసుకున్నారని, అందులో 920 సెల్‌ఫోన్లు రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పజెప్పినట్లు తెలిపారు. మిగతా ఫోన్లు కూడా త్వరలో ట్రేస్ అవుట్ చేసి బాధితులకు అప్పజెప్తామన్నారు.

## అంగన్‌వాడీల ప్రక్షాళన

**ప్రభుత్వ తీరుపై సిబ్బంది అసంతృప్తి**

- 65 ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాల తొలగింపు
- రిటైర్మెంటు బెనిఫిట్లపై నిరసన గళం
- ఇప్పటికే 135 చోట్ల టీచర్లు.. 782 సెంటర్లలో ఆయాలు లేరు
- తాజా నిర్ణయంతో భారీగా పెరిగిన ఖాళీలు
- కొత్త నోటిఫికేషన్‌పైనే మహిళల ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 5 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రక్షాళన ప్రారంభమైంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 65 సంవత్సరాలు నిండిన టీచర్లు, ఆయాలను తొలగిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. రిటైర్‌మెంటు బెనిఫిట్ కింద టీచర్‌కు రూ.లక్ష, ఆయాకు రూ.50వేలు ప్రకటించింది. దీనిపై ఆ వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉంటే గతంలో ఉన్న ఖాళీలతోపాటు ప్రస్తుత ఖాళీలను భర్తీ చేయనున్నారు. దీంతో కొత్త నోటిఫికేషన్‌పై మహిళా నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.

### సిబ్బందిలో ఆందోళన..

ప్రభుత్వ తాజా నిర్ణయంతో అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు రిటైర్‌మెంటు బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం అన్యాయం చేసిందని వాదిస్తున్నారు. గతంలో తాము దీక్షలు చేసిన సందర్భంలో నాటి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం కొలువుదీరాక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సైతం మాటిచ్చారని చెబుతున్నారు. 65 ఏళ్లకు రిటైర్‌మెంటు కాగానే టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష చొప్పున ఇస్తామని ప్రకటించి ఇప్పుడేమో సగానికే పరిమితం చేశారని ఆగ్రహిస్తున్నారు. తమను అన్ని పనుల్లోనూ భాగస్వామ్యం చేసి తగిన ప్రయోజనాన్ని మాత్రం చేకూర్చడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై జిల్లాల వారీగా నిరసన కార్యక్రమాలు, నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

### నోటిఫికేషన్‌పై ఆశలు

65ఏళ్లు నిండినవారి స్థానంతోపాటు గతంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలోనే ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నది. దీనిపై మహిళా నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. ఇంటర్ ఆపైనా అర్హత ఉన్నవారికి టీచర్లు, ఇంటర్ అర్హత ఉంటే ఆయాలుగా ఎంపిక చేయడానికి నిర్ణయిస్తున్నారు. ప్రధానంగా ఈ ఉద్యోగాలను కలెక్టర్ల ఉత్తర్వులతో ఆర్డీవోల పర్యవేక్షణలో ఎంపిక చేస్తుంటారు. గతంలోనూ రాజకీయపరమైన పైరవీలతో ఉద్యోగాలు పొందిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు కూడా పైరవీలకు ఆస్కారం ఉంటుందా.. లేక రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారా అనే విషయంపై అస్పష్టత నెలకొంది. అయితే ఖాళీగా ఉన్న సెంటర్ల పరిధిలో పైరవీలు ఊపందుకున్నాయి. అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభిస్తున్నారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది వివరాలు**

| జిల్లా | సంగారెడ్డి | సిద్దిపేట | మెదక్ |
|---|---|---|---|
| మొత్తం సెంటర్లు | 1504 | 1150 | 1076 |
| టీచర్లు లేని సెంటర్లు | 40 | 62 | 33 |
| ఆయాలు లేని సెంటర్లు | 304 | 149 | 279 |
| 65 ఏళ్లు నిండిన టీచర్లు | 39 | 16 | 06 |
| 65 ఏళ్లు నిండిన ఆయాలు | 110 | 110 | 73 |
| కొత్తగా భర్తీ చేసే టీచర్ల సంఖ్య | 79 | 78 | 39 |
| కొత్తగా భర్తీ చేసే ఆయాల సంఖ్య | 414 | 259 | 352 |



### వేతనంలో సగం పెన్షన్ అందజేయాలి



మేము చేసే పనులతో పాటు అదనంగా పనులు చెబుతున్నారు. సర్వేల పేరిట భారం మోపుతున్నారు. కానీ అదనంగా ఎలాంటి జీతభత్యాలు ఇవ్వడం లేదు. 2017 నుంచి టీఏ, డీఏలు కూడా అందజేయలేదు. రిటైర్మెంటు బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష మంజూరు చేయాలి. రిటైర్మెంటు సమయంలో పొందిన వేతనంలో సగం మొత్తాన్ని పెన్షన్ రూపంలో ఇవ్వాలంటున్నాం.

- పద్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ)



మొక్కను నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### ఆక్సిజన్ మాస్క్‌లు పెట్టుకునే రోజులు
## రావద్దంటే మొక్కలు నాటాలి

హుస్నాబాద్, జూలై 5 : ఆక్సిజన్ మాస్క్‌లు పెట్టుకునే రోజులు ఎప్పటికీ రావద్దనుకుంటే ప్రతీ వ్యక్తి మొక్కలు నాటడం కర్తవ్యంగా భావించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్ ఆవరణలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాలన్నారు. ఇష్టమైన వారి పేరు మీద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జిల్లాలో 21 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందని, హుస్నాబాద్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండేలా వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మోడల్ స్కూల్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో రామ్మూర్తి, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, నళినిదేవి తదితరులున్నారు.

## ఇక అధికారులదే బాధ్యత

- ప్రజాసమస్యలు పరిష్కరించండి
- డయాలసిస్‌పై త్వరలో ప్రభుత్వ సర్వే
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూలై 5: గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీల పదవీకాలం పూర్తయినందున ఇక నుంచి అధికారులే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. 'మీరే ప్రజా సమస్యలు తెలుసుకోవాలి. పరిష్కరించాలి. మీతో కాని పనులు నా దృష్టికి తీసుకురండి. సమస్యలను దాచిపెడితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐవోసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మూడు జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ కలెక్టర్లు మిక్కిలినేని మను చౌదరి, పమేలా సత్పతి, ప్రావీణ్యతో పాటు అదనపు కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, మత్స్య, పశుసంవర్ధక, వ్యవసాయ, విద్యుత్ వంటి 15 అంశాలపై ఐదు గంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ అధికంగా కిడ్నీలు ఫెయిలై డయాలసిస్ కోసం వెళ్తున్నారని, దీనిపై ప్రభుత్వం ఒక సర్వే నిర్వహిస్తున్నదని, దానికి పరిష్కార మార్గం కనుక్కుంటామన్నారు. రాష్ట్రంలోనే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తానని, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నుంచి చేపలు, మేకలు, గొర్లు హైదరబాద్‌కు ఎగుమతి చేసేలా ప్రత్యేక దృష్టి సారిస్తానని వెల్లడించారు. ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ దేవాలయం, శనిగరం ప్రాజెక్టు, మహసముద్రం గండి, రాయికల్ జలపాతం, సర్వాయిపేట కోట, పీవీ స్వగ్రామం వంగర, కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రఫుల్ దేశాయ్, రాధిక గుప్తా, లక్ష్మీకిరణ్ వెంకటరెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

### పునరావాస కాలనీ సందర్శన

అక్కన్నపేట, జూలై 5: గౌరవెల్లి ప్రాజెక్టు పునరావాస కాలనీ నిర్మాణ పనులను శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సేవాలాల్ మహరాజ్ తండాలో ఆర్టీసీ బస్‌సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అక్కడే పత్తి పొలంలో పనులు చేస్తున్న కూలీలతో కాసేపు ఆయన ముచ్చటించారు.

### త్రిబుల్ ఐటీ బాట..
## సర్కారు బడి ఘనత

- జిల్లా నుంచి 324 మంది ఎంపిక
- రాష్ట్రంలోనే అగ్రస్థానం

సిద్దిపేట క్రైం, జూలై 5 : జిల్లా నుంచి బాసర త్రిబుల్ ఐటీకి ఎంపిక అయ్యే విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతూ వస్తున్నది. గత సంవత్సరం 320 మంది విద్యార్థులు త్రిబుల్ ఐటీకి ఎంపిక కాగా, ఈసారి 324 మంది బాసర బాట పట్టనున్నారు. 324 మంది విద్యార్థుల్లో 300 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి కాగా, 24 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉన్నారు. వరుసగా రెండో ఏడాది రాష్ట్రంలో బాసర త్రిబుల్ ఐటీకి అత్యధికంగా విద్యార్థుల ఎంపికైన జిల్లాగా సిద్దిపేట మొదటి స్థానాన్ని దక్కించుకుంది.

### టెన్త్ ఫలితాలు ఆధారంగా..

బాసర త్రిబుల్ ఐటీకి పదో తరగతి ఫలితాల ఆధారంగా ఎంపిక చేస్తారు. 10 జీపీఏ, 9.9 జీపీఏ, 9.8 జీపీఏ, 9.7 జీపీఏ మార్కులు సాధించిన వారిలో రిజర్వేషన్ పరిగణలోకి తీసుకొని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఇక టెన్త్ ఫలితాలలో గత మూడు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ఉత్తమ స్థానంలో నిలుస్తున్నది. 2022 రాష్ట్రంలో మొదటి స్థానం, 2023లో రెండో స్థానం, ఈ సంవత్సరం 98.61 శాతం ఫలితాలతో మరోసారి రెండవ స్థానం దక్కించుకుంది. జిల్లాలో 227 హైస్కూళ్లు, 14 ఆదర్శ పాఠశాలలు, 22 కస్తూర్బా పాఠశాలలో ఉన్నాయి. ఈసారి టెన్త్ ఫలితాలలో 65 ప్రభుత్వ పాఠశాలలో 125 మందికి 10 జీపీఏ వచ్చింది. 9.9 జీపీఏ, 9.8 జీపీఏ వచ్చినవారు వందల సంఖ్యలో ఉన్నారు. గత సంవత్సరంతో 123 మంది 10 జీపీఏ సాధించగా ఈ సారి 125 మంది సాధించారు.

**మండలం వారీగా ఎంపికైన విద్యార్థులు**

| | |
|---|---|
| చిన్నకోడూరు | 62 |
| నంగునూరు | 61 |
| కోహెడ | 30 |
| సిద్దిపేట అర్బన్ | 24 |
| భూంపల్లి | 20 |
| కుకునూరుపల్లి | 14 |
| సిద్దిపేట రూరల్ | 11 |
| మద్దూరు | 10 |
| హుస్నాబాద్ | 9 |
| కొండపాక | 8 |
| జగదేవ్‌పూర్ | 7 |
| దుబ్బాక | 7 |
| రాయపోల్ | 6 |
| తొగుట | 5 |
| మిరుదొడ్డి | 5 |
| కొమురవెల్లి | 4 |
| దౌల్తాబాద్ | 3 |
| గజ్వేల్ | 2 |
| చేర్యాల | 1 |
| ధూళిమిట్ట | 1 |



దుబ్బాక శివారులో పాడుబడిన బావిలో చెత్త, ప్లాస్టిక్‌ను దహనం చేస్తుండడంతో కమ్ముకున్న పొగ

## ఇదేనా..చెత్తశుద్ధి?

- దుబ్బాక బల్దియాలో నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టణ శివారు, పాడుబడిన బావుల్లో వ్యర్థాలు
- ఏళ్లు గడిచిన డంపుయార్డుకి మోక్షమేది ?
- ప్రారంభానికి నోచుకోని డీఆర్‌సీసీ



నిరూపయోగంగా డీఆర్‌సీసీ కేంద్రం

దుబ్బాక, జూలై 5 : దుబ్బాక మున్సిపాలిటీలో చెత్తపై చిత్తశుద్ధి లోపించింది. వ్యర్థాల డంపింగ్‌కు పాడుబడిన బావులు.. పట్టణ శివారులే దిక్కయ్యాయి. ఇష్టారీతిగా ఎక్కడ పడితే అక్కడ చెత్తను నింపేస్తుండడంతో బల్దియా నలుదిక్కులు దుర్గంధభరితంగా మారింది. నిరంతరం ప్లాస్టిక్‌చెత్త మంటలతో శివారు ప్రాంతాలు పొగతో నిండిపోతున్నాయి.

### నిరుపయోగం

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో నాలుగేళ్ల క్రితం లచ్చపేట వార్డు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఆరు ఎకరాల 30 గుంటల భూమిలో ప్రహరీని నిర్మించి రూ.1.30 కోట్లతో డంపింగ్‌యార్డు, డీఆర్‌సీసీ (డ్రై రిసోర్స్ కలెక్షన్ కేంద్రం, వేేబ్రిడ్జి కేంద్రాలను నిర్మించారు. దీంతో స్థానిక ప్రజలు హైకోర్టుకు వెళ్లారు. కేవలం డంపింగ్‌యార్డుపైనే అభ్యంతరం ఉండగా.. డీఆర్‌సీసీ కేంద్రాన్ని కూడా అధికారులు ప్రారంభించ లేదు. దీంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డు, చెత్త శుద్ధి కేంద్రాలు నిరూపయోగంగా మరాయి.

### కమ్ముకుంటున్న పొగ

దుబ్బాక పట్టణ శివారు మొత్తం చెత్తకుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాల అడ్డాగా మారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో తడిచెత్త, పొడిచెత్త సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది, ఆ వ్యర్థాలను పట్టణ శివారులో రహదారులకు ఇరువైపుల కుమ్మరిస్తున్నారు. పాడుబడిన బావులను సేకరించిన చెత్తతో నింపేస్తున్నారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం, టీటీడీ కల్యాణ మండపం, దర్మాజీపేట, మల్లాయపల్లి రహదారుల వద్ద చెత్త, ప్లాస్టిక్ కాగితాలను వేశారు. ఈ చెత్తకు నిప్పంటించడంతో తెల్లవారితేనే పట్టణం చుట్టూ పొగ కమ్ముకుంటుంది. స్వచ్ఛమైన గాలి కోసం ఉదయం వాకింగ్‌కు వెళ్లే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పట్టణ శివారులోని బావుల్లో చెత్త వేయడం మూలంగా ప్లాస్టిక్ కాగితాలు గాలికి కొట్టుకుపోయి పొలాల్లో చేరుతున్నాయి.

### చెరువులు చెత్తమయం

దుబ్బాక చుట్టూ ఉన్న రామసముద్రం, పెద్దచెరువు, ఏదుల్లా చెరువు, దర్మాజీపేట చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయి. కట్టు కాలువ వద్ద విచ్చలవిడిగా చెత్తను, ప్లాస్టిక్ కాగితాలు వేయడంతో చిన్నపాటి వర్షానికి చెత్త మొత్తం చెరువులో చేరుతుంది. దుబ్బాక మున్సిపాలిటీ శానిటేషన్ విభాగం తీరుపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. పారిశుధ్యంపై దృష్టిసారించి మున్సిపాలిటీని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.






## చలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో..

# తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్ట్



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

తూప్రాన్, జూలై 5: విద్యార్థి సంఘాలు, యువజన నాయకుల ముట్టడి కార్యక్రమాల నేపథ్యంలో పోలీసులు కట్టడి చర్యలు చేపట్టారు. టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తూప్రాన్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. విద్యార్థి సంఘాలు టీజీఎస్‌పీఎస్‌సీ, అసెంబ్లీ, కలెక్టరేట్ల ముట్టడికి బీఆర్‌ఎస్‌వీ, ఎస్‌ఎఫ్‌ఐ, బీజేవైఎం తదితర సంఘాలు పిలుపునిచ్చాయి. ఒకేరోజు విద్యార్థి సంఘాలు, యూత్ నాయకులు హైదరాబాద్‌లో ఆందోళనకు పిలుపునివ్వడంతో తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే కార్లు, అనుమానిత వాహనాలు, బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## నేడు 'జీనోసిస్ డే' సందర్భంగా రేబిస్ వ్యాక్సిన్

నర్సాపూర్, జూలై 5: ఈ నెల 6న ప్రపంచ జీనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్‌లోని పశువైద్యశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మూడు నెలలు దాటిన కుక్కలకు వాటి యజమానులు తప్పనిసరిగా ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీనోటిక్ వ్యాధులు అనగా పశువుల నుంచి మనుషులకు వచ్చే జబ్బులని చెప్పారు. వీటిలో రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసిల్లోస్ వంటివి ఉన్నాయన్నారు. శనివారం ప్రపంచ జీనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయనున్నందున ఈ అవకాశాన్ని కుక్కలను పెంచేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి

చిన్నశంకరంపేట, జూలై 5: విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి వార్డెన్ సత్యనారాయణకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నాడు. చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వసతిగృహం స్థితి గతులపై హాస్టల్ వార్డెన్‌తో చర్చించారు.

# మాదారం స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి స్థానికుల వినతి

జిన్నారం, జూలై 5: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారంలో స్టోన్‌క్రషర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో కలెక్టర్‌ను మాదారం గ్రామానికి చెందిన నాయకులు రాజుగౌడ్ తదితరులు కలిసి క్రషర్ల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న స్టోన్‌క్రషర్లతో నిత్యం పేలుళ్ల శబ్దాలు, ధ్వని, వాయు కాలుష్యం అవుతున్నదని, వ్యవసాయ రంగానికి కంకర మిషన్లతో ప్రమాదం నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దని కలెక్టర్‌ను కోరినట్లు గ్రామ నాయకులు, ప్రజలు తెలిపారు.

## 'నీట్' అభ్యర్థులకు న్యాయం చేయండి

సంగారెడ్డి రూరల్, జూలై 5 : నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించినా కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని తీన్మార్ మల్లన్నకమిటీ రాష్ట్ర సభ్యుడు నరేష్‌యాదవ్ విమర్శించారు. సంగారెడ్డిలో శుక్రవారం కలెక్టర్ క్రాంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి, కష్టపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా సంగారెడ్డిలో కుక్కల బెడదతో చిన్నారులు గాయాలపాలవుతున్నారని, వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో విజయ్, సచిన్, తుకారాం, నరేష్ ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి సమస్య విన్నవిస్తున్న స్థానికులు

## కాజీపల్లి కాలుష్య సమస్యను పార్లమెంటులో ప్రస్తావించండి



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీజేపీ, జేఏసీ నాయకులు

జిన్నారం, జూలై 5: కాజీపల్లి పరిధిలో నెలకొన్న పారిశ్రామిక కాలుష్యంపై పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు శుక్రవారం కాజీపల్లి జేఏసీ, మండల బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా ప్రజలు, మూగజీవాలు నష్టపోతున్న తీరును వివరించారు. పార్లమెంటు సమావేశాల్లో కాలుష్యం అంశాన్ని ప్రస్తావించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఎంపీని కలిసినవారిలో బీజేపీ నాయకులు జగన్‌రెడ్డి, నర్సింగరావు, జేఏసీ నాయకులు రమాకాంత్, కుమార్‌యాదవ్, సురేష్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి: సీఐటీయూ



సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

శివ్వంపేట, జూలై 5: పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో కలిసి వారికి మద్దతుగా ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీవో తిరుపతిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మల్టీ పర్పస్ రద్దుపై ప్రభుత్వం అలసత్వం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ పంచాయతీ కార్మికులకు అమలు చేయలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కను పలుమార్లు కలిసినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు రాకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేసి, వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## కేతకీలో అమావాస్య పూజలు




శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఝరాసంగం, జూలై 5: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతోపాటు సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదేవిధంగా మండలపరిధిలోని బర్ధీపూర్, మాచ్నూర్ గ్రామశివారలో గల రామేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించనున్నట్టు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

## భగలాముఖి ఆలయంలో ఘనంగా మహామంత్ర హవనం


శివ్వంపేట, జూలై 5: మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం భగలాముఖి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వరశర్మ, ప్రధాన పూజారి సంతోష్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి మహా పూజ నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహామంత్ర హవనం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.























# మెదక్ డిపో.. తంతాలు డిటో..!

- ఆర్టీసీ కార్మికులపై పనిభారం
- అదనపు డ్యూటీలతో ఒత్తిడి
- సెలవులకు కొర్రీలు
- గత నెలలో డ్రైవర్ల ఆందోళన
- అయినా.. మారని అధికారుల తీరు..!



అధికారుల వేధింపులు మానుకోవాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 5: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఒత్తిడితో అనారోగ్యానికి గురైనా.. సిబ్బంది కొరత ఉందంటూ అదనపు పనులు అప్పగిస్తున్నారని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన టార్గెట్ చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ డీఎం, సీఐ, ఇతర అధికారుల వేధింపులు తాళలేక గత నెలలో మూడు రోజులపాటు డ్రైవర్లు శాంతియుత నిరసనకు దిగారు. సుదీర్ఘచర్చల తర్వాత సమస్యల పరిష్కారానికి యాజమాన్యం దిగి రావడంతో తిరిగి డ్రైవర్లు విధుల్లో చేరారు. అయినప్పటికీ అధికారుల్లో మార్పు రావడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. ఓ వైపు పనిభారం.. మరోవైపు అధికారుల వేధింపులతో ఉద్యోగ, కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మెదక్ ఆర్టీసీ పరిధిలో 71 మంది డ్రైవర్లు, 180 మంది కండక్టర్లు ఉండగా.. ఆర్టీసీ బస్సులు 44, అద్దె బస్సులు 55 ఉన్నాయి. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం 8 గంటల వరకు మాత్రమే డ్యూటీ చేయాలి. కానీ, మెదక్ డిపో పరిధిలో 12 నుంచి 16 గంటలు విధుల్లో ఉండే పరిస్థితులు కల్పిస్తున్నారని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

### మహిళా కండక్టర్లుకూ సెలవుల్లేవ్..

ఆర్టీసీడ్రైవర్లు, కండక్టర్లతోపాటు కార్మికులు, ఇతర సిబ్బందికి సెలవులు మంజూరు చేయకుండా ఉన్నతాధికారులు పలు కొర్రీలు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మహిళా కండక్టర్లకు సైతం సెలవులు మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. సెలవు అవసరమైతే డబుల్ డ్యూటీ చేయాలని నిబంధన పెడుతున్నట్లు వినికిడి. డిపో అధికారులు, సూపర్‌వైజర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా.. కార్మిక సంఘాలు, సంక్షేమ మండళ్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని, ఇక తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఉద్యోగ, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రోజుకు 360 కిలోమీటర్లు..

గతంలో విధులు నిర్వహించే ఒక్కో డ్రైవర్ బస్సును రెండు రోజుల్లో 540 కిలో మీటర్ల నడిస్తుండగా.. ప్రస్తుతం రోజుకు 360 కిలోమీటర్లు డ్యూటీ చేస్తున్నారు. విధి నిర్వహణలో రోజుకు కిలోమీటర్లు అదనంగా డ్యూటీ చేస్తున్నారు. దాంతో వారిపై పని భారం పెరిగి అనారోగ్యాల పాలవుతున్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సాధారణంగా బస్సులో 50 ఉంచి 60 మంది ప్రయాణికులు ఎక్కాల్సి ఉండగా.. 120 నుంచి 150 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులు పెరిగిన నేపథ్యంలో కేఎంపీఎల్ ఎలా వస్తుందని వారు వాపోతున్నారు. టార్గెట్లను చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ఒక రోజు విధులకు హాజరు కాకపోతే చార్జీషీట్లు జారీ చేస్తూ.. ఆరు నెలల ఇంక్రిమెంట్లను వెనక్కి పంపుతున్నట్లు సమాచారం. అంతేకుండా గైర్హాజరై వారిని నుంచి సంజాయిషీ అడుగుతున్నారు.

మెదక్ ఆర్టీసీ బస్టాండ్




### పాత నిబంధనలనే అమలు చేస్తున్నాం

మెదక్ డిపోలో సంస్థ పాత నిబంధనలనే అమలు చేస్తున్నాం. ఉద్యోగ, కార్మికులను వేధించడం లేదు. అవసరం ఉన్న ఉద్యోగులతోపాటు, డ్రైవర్లు, కండక్టర్లకు సెలవు మంజూరు చేస్తున్నాం. అదనపు డ్యూటీ ఎవరికీ కేటాయించడం లేదు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బస్సులు నడపాల్సి ఉంటుంది.

- సుధా, ఆర్టీసీ డీఎం మెదక్

పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం

## ప్రధానోపాధ్యాయుడి మృతి

ఆర్టీసీ బస్సు ఢీ కొని అనంతలోకాలకు..



చేర్యాలఆస్పత్రిలో ఉన్నప్పుడు చంద్రశేఖర్

చేర్యాల, జూలై 5: రోజువారీలాగా ఉదయాన్నే పాఠశాలకు వెళుతున్న ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. మరికొద్ది నిమిషాలైతే పాఠశాలకు చేరు కోనుండగా అంతలోనే జరిగిన రోడ్డు ప్రమాదంతో ఆయన మృత్యువాత పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనం సమీపంలో నివాసముంటున్న కోహీర్ చంద్రశేఖర్ (59) ధూళిమిట్ట మండలం కూటిగల్ సమీపంలోని తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజూ చేర్యాల మీదుగా బైక్‌పై పాఠశాలకు వెళుతుండగా, మద్దూరు మండలం నర్సాయలిపల్లి మార్గంలోని పట్టణ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో తీవ్రగాయాలపాలై అపస్మారకస్థితికి చేరుకున్న చంద్రశేఖర్‌ను స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అక్కడి నుంచి సికింద్రాబాదులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేర్యాల ఎస్‌ఐ ఎస్‌ఐ దామోదర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన కోహీర్ చంద్రశేఖర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. చంద్రశేఖర్ మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జులై 5: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రామీణ మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు మహిళా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి, జిల్లాలోని ఆయా బ్యాంకుల స్త్రీనిధి ద్వారా మహిళా శక్తి యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. వివిధ రకాలైన ఈవెంట్ మెనేజ్‌మెంట్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, వ్యవసాయ పరికరాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మహిళా క్యాంటీన్ తదితర 13 రకాల యూనిట్ల ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్నారు. మహిళాశక్తి లబ్ధిదారులకు యూనిట్ల గ్రేడింగ్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుని సబ్సిడీ పథకాలను విరివిగా అందించాలని, ఇందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి జ్యోతి, అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేతన బకాయిలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాలనర్సయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండపాక, జూలై 5: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఓఈ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించి అధికారులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు 9 నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొండపాక, కుకునూరుపల్లి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జాలిగామా ప్రభాకర్, భోగి సాయికుమార్, ఏలేశ్వరం రవీందర్ నాయకులు పల్లె శ్రీనివాస్ గొడుగు నారాయణ, దున్న మల్లవ్వ, పిల్లి లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్‌తో సురక్షిత నీరు

నిజాంపేట, జూలై 5: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని కేంద్ర బృంద సభ్యులు డి. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బిక్షపతి అన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నల్లాలను శుక్రవారం కేంద్రబృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు నీటి సరఫరా, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని , నీటిని వృథా చేయవద్దని సూచించారు. అలాగే మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, గ్రామస్తులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నల్లాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



అంబేడ్కర్ స్టేడియంలో లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

## ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 5: సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జావిద్ అలీ పర్యవేక్షణలో ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. 8, 10, 12 ఏళ్ల బాల బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7 న గచ్చిబౌలిలో జరిగే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో

## యువకుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

రాయపోల్, జూలై 5: ఖాళీగా తిరగడం మానేసి ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. బేగంపేట ఎస్‌ఐ భువనేశ్వర్ కథనం ప్రకారం.. ఎల్కల్ గ్రామానికి చెందిన మంద నర్సింలు, యేసుమని దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజు(24) కొన్ని రోజుల నుంచి ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఏదైనా పని చేసుకోవాలని గురువారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో రాజు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం తండ్రి నర్సింలు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా, రాజు చింత చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేయండి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

జహీరాబాద్, జూలై 5: విద్యాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బసవ మంటపంలో ప్రైవేటు (ట్రస్మా) పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీని సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు తమ ఉన్నతికి కారణమైన గురువులను ఎన్నటికీ మర్చిపోరని, వారు ఎక్కడ కనిపించినా ఆప్యాయతతో దగ్గరకు వచ్చి చేతులు జోడించి నమస్కరిస్తారన్నారు. సమాజంలో గురువుకు దక్కే గౌరవం మరెవ్వరికి ఉండదని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యవంతమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘమైనదన్నారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు క్రిష్ణారెడ్డి, దశరథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. ట్రస్మా నాయకులు ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్‌ను పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని గడీ వీధికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మిల కుమార్తె, అంధ విద్యార్థిని శివానీ ఐఐఎంకు ఎంపిక కావడంతో ఆమె తల్లిదండ్రులను ఎంపీ సన్మానించారు.

### రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ

నారాయణఖేడ్, జూలై 5: విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా, మహారాష్ట్ర పూణెలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన మహబూబ్‌ఖురేషి, రఫీక్ ఖురేషిల కుటుంబాలను ఎంపీ సురేష్ షెట్కార్ పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు రషీదు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్ అలీ, మైనోద్దీన్, దిల్‌దార్‌ఖాన్, సుబురు, గౌస్ చిస్తీ, తదితరులు ఉన్నారు.

## ఏటీఎంలలో చోరీకి యత్నం..



రామాయంపేట, జూలై 5: పట్టణంలో గురువారం అర్ధరాత్రి దుండగులు ఏటీఎంల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఎంత కష్టపడ్డా మిషన్లు తెరుచుకోకపోవడంతో వాటిని రాళ్లతో ధ్వంసం చేశారు. రెండు గ్యాంగులుగా వచ్చిన దుండగలు కామారెడ్డి పాత హైవేలోని రెండు ఏటీఎంలలో దోపిడీకి ప్రయత్నించారు. అయితే, ఎంతకూ మిషన్లు తెరుచుకోలేదు. రాళ్లు తెచ్చి మిషన్లు ధ్వంసం చేసినా.. డబ్బు దొరకలేదు. దీంతో తమ ప్రయత్నం మానుకుని వెళ్లిపోయారు. ఎస్‌ఐ రంజిత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి మొక్కలు స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



ఖేడ్ మండలం హంగర్గ.బిలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నారాయణఖేడ్, జూలై 5: మండలంలోని హంగర్గ.బి శివారులోని కంకర క్రషర్ మిషన్ ఆవరణలో సాగు చేస్తున్న 16 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ విద్యాచరణరెడ్డి కథనం ప్రకారం.. హంగర్గ.బి శివారులోని కంకరమిల్లులో ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ షరిహాకు చెందిన నవీన్‌కుమార్(33), అదే రాష్ట్రంలోని చెర్రయ్‌కోట్ పట్టణ సమీపంలోని హఫీజ్‌పూర్‌కు చెందిన సంతోష్‌కుమార్(36)లు పని చేస్తున్నారు. వీరికి గంజాయి పీల్చే అలవాటు ఉండటంతో అక్కడి నుంచి వచ్చే సమయంలోనే కొంత ఎండు గంజాయి వెంట తెచ్చుకున్నారు. కొన్ని ఎండు విత్తనాలను కంకరమిల్లు సమీపంలోని పిచ్చి మొక్కల మధ్య చల్లడంతో అవి పెరిగాయి. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అక్కడి 16 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



యాదయ్య (ఫైల్)

రాయపోల్, జూలై 5: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బేగంపేట ఎస్‌ఐ భువనేశ్వర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన జాల యాదయ్య(55) వ్యవసాయంతోపాటు గ్రామంలో టీ పాయింట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉండగా ఇద్దరికి వివాహాలయ్యాయి. ఏడాది క్రితం కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. దీంత సుమారు రూ. 4లక్షలు అప్పులయ్యాయి. అయితే, అప్పు ఎలా తీర్చాలని తరచూ భార్యతో చెప్పుకుని మదన పడేవాడు. గురువారం రాత్రి 10 గంటలకు తన టీ పాయింట్ వద్ద పడుకుంటానని చెప్పి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారినా రాకపోవడంతో వెళ్లి చూడగా ఎక్కడా కనిపించలేదు. సాయంత్రం గ్రామ సమీపంలో విద్యుత్ టవర్‌కు ఉరివేసుకుని ఉండగా, గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కర్ణాటక నుంచి తీసుకొస్తున్న డీజిల్ పట్టివేత

మునిపల్లి, జూలై 5: కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తుండగా శుక్రవారం మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మునిపల్లి ఏఎస్‌ఐ బిక్షపతి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన విజయ్‌కుమార్ అక్కడి నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా డీజిల్ తీసుకవచ్చి మునిపల్లి మండలంలోని మైనింగ్‌లో పనిచేస్తున్న వాహనాలకు విక్రయిస్తున్నాడు. శుక్రవారం 161 ముంబై జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, డీజిల్ అక్రమంగా రవాణా చేస్తున్న విషయం బయటపడింది. దీంతో 560లీటర్ల డీజిల్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్‌ఐ బిక్షపతి తెలిపారు. సివిల్ సప్లయ్ ఎమ్మార్వో స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

# భర్తను హత్య చేయించిన భార్య

- మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని..
- ప్రియుడితో కలిసి ఘాతుకం
- నిందితురాలి సహా మరో ముగ్గురు అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్, సీఐ క్రాంతికుమార్

జీడిమెట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దారుణహత్యకు గురైన అంబులెన్స్ వ్యాపారి అనిల్‌కుమార్ హత్య కేసును నగరంలోని జగద్గిరిగుట్ట పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భార్యే హంతకురాలని తేల్చి.. ఆమెతో పాటు ఈ హత్యలో భాగస్వాములైన మరికొందరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం, ఆమెకు ఆస్తిలో వాటా ఇస్తాననడంతో భార్య పథకం ప్రకారం ఈ హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించారు.

బాలానగర్ డీసీపీ కె. సురేష్‌కుమార్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌లు కేసు వివరాలను వివరించారు. వారి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గంకు చెందిన గాజుల అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (35), భాగ్యలక్ష్మి భార్యాభర్తలు. ఇద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కూకట్‌పల్లి ప్రాంతంలోని ఓ అద్దె ఇంట్లో ఉండగా, అనిల్ మొదట డ్రైవర్‌గా పని చేశాడు. భాగ్యలక్ష్మి స్కూల్‌లోనూ, వస్త్ర దుకాణంలోనూ పని చేసింది. తర్వాత అనిల్‌కుమార్ పాత అంబులెన్స్ కొనుగోలు చేసి సొంతంగా తిప్పేవాడు. ఆర్థికంగా స్థిరపడిన తర్వాత మరో ఐదు అంబులెన్స్‌లు కొనుగోలు చేశాడు. భాగ్యలక్ష్మి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో సొంత బ్యూటీపార్లర్ పెట్టింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. అయితే, అనిల్‌కు బంధువైన ఓ మహిళ గోషామహల్ ప్రాంతంలో భర్త పిల్లలతో కలిసి ఉండేది. కరోనా సమయంలో అనిల్ భార్యపిల్లలు సొంత ఊరికి వెళ్లగా, గోషామహల్ ప్రాంతంలో ఉండే మహిళ అనిల్‌కు దగ్గరైంది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో ఆమె భర్తను వదిలేసి పిల్లలతో కలిసి కూకట్‌పల్లికి వచ్చేసింది. ఆమెకు అద్దె ఇంట్లో ఉంచిన అనిల్ ఆమెతోనే ఉండేవాడు. విషయం తెలుసుకున్న భాగ్యలక్ష్మి భర్తను నిలదీసింది. దీంతో భార్యను నిత్యం కొట్టేవాడు.

ఇదే క్రమంలో శ్రీనివాస్‌నగర్‌లో సొంత ఇల్లు కొనుగోలు చేసి తనతో సంబంధం ఉన్న మహిళను అక్కడ ఉంచాడు. మియాపూర్‌లో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేశాడు. భార్య కృష్ణవేణితో పాటు సదరు మహిళ టిఫిన్ సెంటర్ నిర్వహించేవారు. టిఫిన్ సెంటర్‌లో ఆల్విన్ కాలనీకి చెందిన మార్తాండా మల్లేష్(28) వంటమాస్టర్‌గా పని చేసేవాడు. టిఫిన్ సెంటర్‌ను జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌కు మార్చాడు. అయితే, భర్త తనను పట్టించుకోకుండా మరో మహిళతో గడుపుతుండటంతో భాగ్యలక్ష్మి టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్న వంట మనిషికి దగ్గరైంది. అతనితో సంబంధం పెట్టుకుంది. ఇదే క్రమంలో అనిల్‌కుమార్ తనతో సంబంధం పెట్టుకున్న మహిళకు అబులెన్స్‌లలో, తాను కొనుగోలు చేసిన ఇంట్లో భాగం ఇస్తానని చెప్పడంతో కృష్ణవేణికి ఆగ్రహం తెప్పించింది. తన ప్రియుడు మల్లేష్‌తో కలిసి భర్తను హత్య చేయాలని పథకం వేసింది.

### అంబులెన్స్ డ్రైవర్లకు సుపారీ ఇచ్చి..

భాగ్యలక్ష్మి అనిల్ దగ్గర అంబులెన్స్‌లపై డ్రైవర్లుగా పని చేస్తున్న వివేకానందనగర్ కాలనీలో ఉంటున్న నర్సింహా అలియాస్ నాని(27), సూరారానికి చెందిన నీరుడి నవీన్(26)ను కలుపుకుని, వారికి అంబులెన్స్‌లలో భాగమిస్తానని ఒప్పించి, భర్త హత్యకు పథకం ప్రియుడితో కలిసి పథకం పన్నింది. రూ. 2 లక్షలు నగదు కూడా ఇవ్వడానికి అంగీకరించి, రూ. 50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. ఇందులో నర్సింహా తన స్నేహితులు రాజు, సంజు అనే వారిని కూడా కలుపుకుని గత నెల 28న రాత్రి ఇంట్లో మద్యం తాగుతున్న అనిల్‌కుమార్‌తో కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో బాటిళ్ల పగులగొట్టి అనిల్‌కుమార్ కడుపులో పొడిచి, బ్లేడ్‌తో గొంతు కోసి చంపేశారు. రక్తపు దుస్తులను ఎల్లమ్మబండ శ్మశాన వాటికలో పడేశారు. ఉదయం అనిల్‌కుమార్‌తో సంబంధం పెట్టుకున్న మహిళ.. ఆమె కుమారుడు వచ్చి చూసి, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా మల్లేష్, భాగ్యలక్ష్మిలు బెదిరించి.. వారితోనే రక్తపు మరకలను కడిగించి.. అనిల్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనిల్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేపట్టి, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించారు. భాగ్యలక్ష్మితో పాటు మల్లేష్, నర్సింహా, నవీన్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారినీ త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీసీపీ కె. సురేష్‌కుమార్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

## 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిన్నకోడూరు, జూలై 5 : అక్రమంగా నిల్వచేసిన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేశారనే సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇబ్రహీంనగర్‌కు చెందిన రాజు, సిద్దిపేట పట్టణానికి చెందిన నిశాన్ గౌడ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాలను టార్గెట్ చేసుకుని కొందరు రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం




మద్దూరు: మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి రాధిక, ఎంపీడీవో రామ్మోహన్



సిద్దిపేట రూరల్: రాఘవాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి



నారాయణరావుపేట: గుర్రాలగొందిలో మొక్కలు నాటుతున్న ఎంపీవో శ్రీనివాస్



కుకునూరుపల్లి: మొక్కలు నాటుతున్న పంచాయతీ కార్యదర్శి నాగరాజు

# పచ్చని పండుగ

## వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన అధికారులు

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను విరివిగా నాటాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులు, రైతులతో కలిసి మొక్కలు నాటారు. మానవాళి మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరమని, భవిష్యత్ తరాలకు నాణ్యమైన ప్రాణవాయువు అందాలంటే మొక్కలు పెంచాల్సిందేనని, పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ వారికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన రోజుల్లో ఒక మొక్కను నాటాలని సూచించారు. -ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



రాయపోల్: వడ్డేపల్లిలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి బాబూనాయక్



మిరుదొడ్డి: మొక్కలు నాటుతున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, ఏపీడీ శివాజీ



సిద్దిపేట టౌన్: వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటుతున్న అత్తు ఇమామ్, నాయకులు



కొండపాక: దుద్దెడలో వన మహోత్సవంలో అదనపు డీఆర్డీవో బాలకృష్ణ, అధికారులు



వర్గల్: ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి



బెజ్జంకి: మొక్కను నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో లక్ష్మప్ప



మర్కుక్: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటుతున్న మాజీ సర్పంచ్, స్థానికులు



చేర్యాల : మొక్కలు నాటుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి

## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు




పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న జీపీ సిబ్బంది

దూళిమిట్ట,జూలై 5: మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో శుక్రవారం మిషన్ భగీరథ పైపులకు మరమ్మతు చేయించి లీకేజీని అరికట్టారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైరిపోతుల జనార్దన్

కోహెడ, జులై 5: జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి తెర లేపాయని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ విద్యా శాఖ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. కోహెడలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాను వ్యాపారంగా మలుచుకున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేఖర్, సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు చట్ల సమ్మయ్య ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్‌మేళా



చేర్యాల: పిల్లల ఎత్తు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ పావని

హుస్నాబాద్ / చేర్యాల, జూలై 5: హుస్నాబాద్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రోత్ మేళాను పురస్కరించుకొని 0-5 సంవత్సరాల పిల్లలకు వయస్సుకు తగిన బరువు, పోషకాహార విలువలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరయ్యారు. పోషకాహారంతోనే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాల సుప్రజ, సుజాత తదితరులున్నారు. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పావని విద్యార్థుల బరువు, ఎత్తులు పరిశీలించి నమోదు చేశారు. అలాగే చేర్యాల మండలం చుంచనకోట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్‌మేళాను సూపర్ వైజర్ నాగమణి పరిశీలించారు.

## ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ

దూళిమిట్ట, జూలై 5: మండలకేంద్రంలో రూ. 4లక్షల జడ్పీ నిధులతో నిర్మించబోయే ఎస్సీ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి, తోర్నాల గ్రామంలో రూ. 2.5 లక్షల జడ్పీ నిధులతో నిర్మించబోయే బస్టాండ్ నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ తాజా మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్, ఎస్సీ కుల సంఘం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఏఈవోలకు

## ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి వినతి

హుస్నాబాద్, జూలై 5: వ్యవసాయశాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఏఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని శుక్రవారం హుస్నాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో సుమారు 450 మంది నాలుగేళ్లుగా ఔట్ సోర్సింగ్ ఏఈవోలుగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే వ్యవసాయ విస్తరణ అధికారి నోటిఫికేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఏఈవోలుగా విధులు నిర్వర్తించిన తమకు వెయిటేజీ ఇవ్వాలని కోరారు. ఇందులో వరుణ్‌వర్మ, రోహిత్, మహిపాల్, పవన్ ఉన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని పొట్లపల్లి రోడ్డులో బీసీ భవన్, బీసీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, నాయకులు కొయ్యడ కొంరయ్య, పూదరి రవీందర్‌లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. హుస్నాబాద్‌లో ఎస్టీలకు బంజారా భవన్, మైనార్టీ భవన్, ఎస్సీ సామాజిక వర్గానికి 4 కమ్యూనిటీ హాళ్లు ఉన్నాయని, బీసీ సామాజిక వర్గాలకు ఫంక్షన్‌హాల్, బీసీ భవన్ లేదన్నారు. అలాగే గౌడ సామాజిక వర్గానికి 10 గుంటల భూమి కేటాయించి రూ. 20 లక్షల నిధులు కేటాయించాలని కోరారు.

## బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి




కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట అర్బన్, జూలై 5: కేంద్రం బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకే నేరుగా బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరారు. సింగరేణిని దివాళా తీయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలస్వామి, శశిధర్, సత్తిరెడ్డి, ఎల్లయ్య, వెంకట్, కృష్ణారెడ్డి, రవికుమార్, బాల నరసయ్య, అరుణ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

### 'గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

కొండపాక, జూలై 5: గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ అంబటి బాలచందర్‌గౌడ్ కోరారు. సిద్దిపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తిని శుక్రవారం కలిసి గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్టు ఆయన తెలిపారు.

### 9న ఇసుక వేలం

సిద్దిపేట అర్బన్, జూలై 5: సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సీజ్ చేసిన ఇసుకకు ఈ నెల 9వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అర్బన్ తహసీల్దార్ సలీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనాలనుకునే వారు మంగళవారం ఉదయం 11 గంటల వరకు అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవాలని చెప్పారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తామని ఆయన తెలిపారు.

### పదవులు శాశ్వతం కాదు

బెజ్జంకి, జూలై 5: పదవులు శాశ్వతం కాదని ప్రజల మనస్సులో స్థానం సంపాదించుకోవడమే ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బెజ్జంకిలో శుక్రవారం తాజా మాజీ ఎంపీటీసీలను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ నిర్మల, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### ఫుడ్ పాయిజన్ జరగలేదు

సిద్దిపేట అర్బన్, జూన్ 5: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థకు గురయ్యారన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని కళాశాల చైర్మన్ హరిందర్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కళాశాలలో నర్సింగ్ విభాగానికి చెందిన సుమారు పది నుంచి పదిహేను మంది విద్యార్థులు గురువారం సాయంత్రం బయట నుంచి ఆహారం తీసుకుని తినడం వల్లనే అస్వస్థతకు గురయ్యారన్నారు.

## గ్రామాల్లో సమస్యలు రాకుండా చూడాలి

● మండల ప్రత్యేకాధికారి రాధిక

మద్దూరు, జూలై 5: గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి రాధిక పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నందున గ్రామాల్లో శానిటేషన్‌తో పాటు ఇతరత్రా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీవో ఖాజా మొయినుద్దీన్, ఈసీ పరుశురాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డ్రైడే

వర్గల్, జులై 5: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైదాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల కలిగే అనార్థాలు, రోగాలు, దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరిత, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీకి ఆత్మీయ సన్మానం



తాజా మాజీ ఎంపీటీసీని సన్మానిస్తున్న నాయకులు

మర్కుక్, జూలై 5: మండలంలోని ఎర్రవల్లి గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ తుమ్మ ధనలక్ష్మీకృష్ణను మాజీ సర్పంచ్ మొండి భాగ్యభిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయస్థాయి పురస్కారం అందుకున్న ఎర్రవల్లికి తమవంతుగా సహకరించిన ఎంపీటీసీకి, గ్రామ పంచాయతీ పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విద్యా వికాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, కొమురయ్య, ఆంజనేయులు, గీసు మల్లేశం, శ్రీశైలం, దాసు రామ్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి

● జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీహరిబాబు

నారాయణరావుపేట, జూలై 5: గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలని సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీహరిబాబు సూచించారు. మండలంలోని జక్కాపూర్‌లో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, ఎంఎస్ఎంఈ, ముద్ర పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు, ప్రధాన మంత్రి బీమా, సుకన్య సమృద్ధి యోజన, ఇతర సూక్ష్మ రుణాలు వంటి పథకాలు బ్యాంకు ద్వారా ప్రజలందరికీ చేరవేసే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘం మహిళలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## దేవస్థానాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్న పాలకవర్గం?

● ధ్వజంస్తంభం పైభాగం విరిగి రెండు నెలలైనా పట్టించుకోవట్లేదు

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నారాయణరావుపేట, జూలై5: ఎంతో ప్రసిద్ధిగాంచిన బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానాన్ని పాలకవర్గం, దేవాదాయశాఖ అధికారులు ఆదాయ వనరుగా మార్చుకున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభంపై భాగం విరిగిపడి రెండు నెలలు గడుస్తున్నా పాలకవర్గం, అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఆలయం అభివృద్ధి కోసం ఎంతోమంది దాతలు విరాళాలు ఇస్తున్నప్పటికీ, ఎవరికీ లెక్కలు చెప్పకుండా, మూడోకంటికి తెలియకుండా మాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆలయం అభివృద్ధికి భక్తులు సమర్పించిన కోడెలను ఎవరికి తెలియకుండా అమ్ముకుంటున్నారని, గుడి మరమ్మతుల విషయం వచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దేవస్థానానికి వచ్చిన ఆదాయాన్ని కొల్లగొట్టి వాటాలు పెట్టుకుని పంచుకోవడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న తతంగాన్ని భక్తులు గమనిస్తున్నారని, త్వరలోనే మీ అవినీతిని ప్రజలు ఎండగడుతారన్నారు. వారం రోజుల్లోగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ చేయాలని డిమాండ్ చేశారు. ఆలయంలో జరుగుతున్న అవినీతిపై త్వరలోనే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు, నాయకులు స్వామి, భూమయ్య, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



సిద్దిపేట అర్బన్: విద్యార్థులను సన్మానిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు, తదితరులు



కుకునూరుపలి: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

కుకునూరుపల్లి, జూలై 5: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినిని కుకునూరుపల్లి ఎస్ఐ అభినందించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి విశ్వత్‌రెడ్డి బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపిక అయ్యాడు. అతడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా పాఠశాల యాజమాన్యం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజినినాయుడు, అంజనేయులు, సోఫియా, వెంకట్‌గౌడ్, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చిన్నకోడూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర ఆకాక్షించారు. బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులను శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు గుజ్జ రాజు, బీఆర్ఎస్వీ నాయకులు భానుచందర్, శ్రావణ్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, రాజు, లింగం, స్వామి, చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సిద్దిపేట అర్బన్: బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సిద్దిపేట నియోజకవర్గ విద్యార్థులను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, నాయకులు రమేష్, రాములు, మధు, మాధవ్, వంశీ, విజయ్, సాయిచరణ్, ఆదర్శ్ నాగరాజు, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.




చిన్నకోడూరు: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన చిన్నకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు





సిద్దిపేట అర్బన్: కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన బీజేవైఎం నాయకులు

రాయపోల్, జూలై 5: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదని నిరసిస్తూ బీజేవైఎం పిలుపు మేరకు, శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌కు బయలుదేరిన బీజేపీ ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంకిడి స్వామిని రాయపోల్ మండలం బేగంపేటలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి కొద్దిసేపటి తర్వాత విడిచిపెట్టారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా సెక్రటరీ రవీందర్‌గౌడ్, రామాంజనేయులు, వెంకటేష్‌గౌడ్, కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

● చిన్నకోడూరు: బీజేవైఎం రాష్ట్ర కమిటీ కలెక్టరేట్‌ల ముట్టడి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజు, నాయకులు స్వామి, గోపి, సందీప్, సుమంత్ ఉన్నారు. టీజీపీఎస్సీ ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, బీఆర్ఎస్వీ నాయకులు రాజు, రాజశేఖర్‌రెడ్డి, శ్రావణ్ ఉన్నారు.

# నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదు

● బీజేవైఎం, బీఆర్ఎస్వీ నాయకులు

● **దుబ్బాక/మిరుదొడ్డి:** హైద్రాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికార్యక్రమంలో భాగంగా దుబ్బాక, మిరుదొడ్డి మండలంలోని బీజేవైఎం, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వెంకట్‌గౌడ్, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు సదనందారెడ్డి బీజేవైఎం, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● **బెజ్జంకి:** టీజీపీఎస్సీ ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఏఐఎస్ఎఫ్, సీపీఐ, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ, డీహెచ్‌పీఎస్, ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

● **సిద్దిపేట అర్బన్:** బీజేవైఎం ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేవైఎం నాయకులను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్, నాయకులు ఆంజనేయులు, విజయ్, రాజు, నరేష్, నవీన్, శ్రీధర్, నిహాల్, రమణ, దీపక్, రాహుల్, శ్రీను, రవీందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● **కోహెడ:** మండలంలోని బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది సత్యనారాయణరెడ్డి, కొండబత్తిని సతీష్, మాజీ అధ్యక్షుడు మామిడి కరుణాకర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి గోగీకరి సతీష్, మండల ఉపాధ్యక్షుడు బండ సుమన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



దుబ్బాకలో అరెస్ట్ అయిన బీజేవైఎం నాయకులు

● **మద్దూరు:** రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సంఘాల పిలుపు మేరకు కలెక్టరేట్ల ముట్టడికి తరలివెళ్లకుండా బీఆర్ఎస్ యూత్, స్టూడెంట్‌వింగ్ నాయకులను మద్దూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గూడ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు రవీందర్‌గౌడ్, దూళిమిట్ట సోషల్‌మీడియా అధ్యక్షుడే సాయి, టౌన్ నాయకులు పవన్ తదితరులు ఉన్నారు.

● **చేర్యాల:** కలెక్టరేట్ల ముట్టడికి తరలివెళ్లకుండా చేర్యాల పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ యూత్‌విభాగం నాయకులను పోలీసులు మందుస్తు అరెస్ట్‌చేశారు. అరెస్ట్ అయినవారిలో అవుశర్ల కిషోర్, అవుశర్ల వెంకటేశ్, యాట భిక్షపతి తదితరులు ఉన్నారు.

● **నంగునూరు:** బీఆర్ఎస్ విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం హేయమైనచర్య అని ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, నంగునూరు సొసైటీ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజగోపాలపేట పోలీసులు విద్యార్థి సంఘాల నేతలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించిన సందర్భంగా వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌విద్యార్థి సంఘం నేతలు గోవిందారం రవి, తప్పెట పరశురాములు, రమేశ్ తదితరులు ఉన్నారు



చిన్నకోడూరు: పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్వీ నాయకులతో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్